# యాసంగి సాగుకు రైతన్న సన్నద్ధం


రామకృష్ణకాలనీలో పెరుగుతున్న నారుమడి

- అందుబాటులో విత్తనాలు
- తిమ్మాపూర్ మండలంలో 20 వేల ఎకరాల్లో పంటల సాగు

తిమ్మాపూర్, డిసెంబర్ 3: వానకాలం వరి పంటలు పూర్తయ్యాయి. ధాన్యం అమ్మకాలు కూడా దగ్గర పడ్డాయి. ఇక రైతులు యాసంగి సాగుపై దృష్టి సారించారు. మండల వ్యాప్తంగా నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. కాగా, నారు మడుల్లో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

తిమ్మాపూర్ మండలంలో యాసంగిలో రైతులు సుమారు 20వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయనున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి సంబంధించిన విత్తనాలు అందుబాటులో ఉంచారు. రైతులు నారు మడుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారులు పలు సూచనలు చేశారు. వరి పంటలో నారు మడి యాజమాన్యం కీలకమని, విత్తన మోతాదు, శుద్ధి, తెగుళ్ల నివారణ ముఖ్యమని చెప్తున్నారు.

**వ్యవసాయాధికారుల సూచనలు..**

యాసంగి నారు పోసుకునేందుకు ఈ నెల 20వరకు అనుకూలం. నారు పోసే వారం ముందే నారు మడి దుక్కి దున్ని ఉంచుకోవాలి. నారుపోసే ముందు మళ్లీ దున్నించి సమాంతరంగా చేసుకోవాలి. విత్తనం చల్లిన తర్వాత ఆరు తడి బాగా వచ్చేలా నారు మడి నుంచి నీరు వెళ్లేలా చూసుకోవాలి. విత్తన వడ్లను తప్పనిసరిగా శుద్ధి చేసుకోవాలి. యాసంగిలో స్వల్పకాల వరివిత్తనాలనే ఎంచుకోవాలి. నారుమడిని సిద్ధం చేసుకునేముందు పశువుల ఎరువును మడిని బట్టి చల్లుకోవాలి. నారుమడిలో కలుపు యాజమాన్యం పాటించాలి. విత్తనం చల్లిన వారం, పది రోజుల తర్వాత కలుపు నివారణ మందులను పిచికారీ చేసుకోవాలి. విత్తనం చల్లిన వారం తర్వాతే నీళ్లు పలుచగా ఉంచాలి. నారులో కలుపును గుర్తించకపోతే వరి పంటలో కలుపు మొక్కలు విస్తరిస్తాయి. వరి నాటేసే వారం ముందు గుళికలు చలుకోవాలి. చల్లిన తర్వాత నీటిని నారుమడిలోనే ఉంచాలి.

# పక్కాగా ప్రైవేట్ పాఠశాలల సమాచారం


చిగురుమామిడి పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

- ఆన్‌లైన్‌లో అనుమతి మొదలు, వసతుల వివరాలు
- ప్రభుత్వ మార్గదర్శకాలు విస్మరిస్తే విద్యాశాఖ చర్యలు

చిగురుమామిడి, డిసెంబర్ 3: ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులు, వారికి కల్పించిన వసతుల వివరాలను విద్యాశాఖ పక్కాగా సేకరించింది. ఆయా పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరిచింది. భవిష్యత్తులో స్కూళ్ల నిర్వహణకు అనుమతులు పొందే విషయంలో విధానాలను సవరించే యోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది.

చిగురుమామిడి మండలంలో గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల నాలుగు ఉండగా, వాటికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. విద్యాశాఖ వెబ్‌సైట్‌లోని అంశాల ఆధారంగా సంబంధిత వివరాలు అప్‌లోడ్ చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాల నిర్వహణ లేకుంటే గుర్తింపు రద్దుకు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

**పొందుపరిచిన సమాచారం..**

ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఇందు కోసం ఫీజుల వివరాలు, బడి భవనం, తరగతి గదుల విస్తీర్ణం, పాఠశాల నిర్వహణ, ఖర్చు, ఆయా పాఠశాలల అనుమతులు, అఫీలియేషన్ వివరాలను యాజమాన్యాలు ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుంది.

**సరళీకృతం చేయడానికే..**



విద్యాశాఖ ఆదేశాల మేరకే ప్రైవేట్ బడులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరిచాం. భవిష్యత్తులో బడుల అనుమతులు పొందే విధానాన్ని సరళీకృతం చేయడానికి ఈ ప్రక్రియ దోహదపడుతుంది. ప్రభుత్వం వద్ద వివరాలు ఉంటే తక్షణ చర్యలకు వీలు కలుగుతుంది.

*- కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, ఎంఈవో, చిగురుమామిడి*

**ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పాఠశాలలు**



ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా లోబడి పాఠశాలలను నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం ఆదేశాల మేరకు వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచాం. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నం. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నాం.

*- సమ్మిరెడ్డి, కరస్పాండెంట్, డార్విన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, చిగురుమామిడి*

# శ్రీకాంతాచారికి ఘన నివాళి


శ్రీకాంతాచారికి నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

చిగురుమామిడి, డిసెంబర్ 3: తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరవీరుడు శ్రీకాంతాచారి వర్ధంతి కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఆదివారం బస్టాండ్ వద్ద నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు శ్రీ రామోజ్ రాజకుమార్ ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంతాచారి త్యాగం చిర స్థాయిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయిందని కొనియాడారు. ఆయన విశ్వబ్రాహ్మణ కులంలో పుట్టినందుకు గర్వపడుతున్నామన్నారు. శ్రీకాంతాచారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి మండల కేంద్రంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి సదాచారి, గ్రామాధ్యక్షుడు పోలోజు సదాచారి, నాయకులు వెంకటరమణ, చిరంజీవి, తిరుపతి, సాంబయ్య, రాజయ్య, సంపత్, మల్లయ్య, కొమురయ్య, కిరణ్, అభివర్ధన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


సంఘం నాయకులను సన్మానిస్తున్న కులస్తులు

# పద్మశాలీ సంఘం గ్రామ కమిటీ సమావేశం

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 3: మండలంలోని దేవంపల్లి పద్మశాలీ సంఘం సమావేశాన్ని గ్రామాధ్యక్షుడు విడపు యుగేంధర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం మండలాధ్యక్షుడు దేవసాని సంపత్, ప్రచార కార్యదర్శి గుండ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాధ్యక్షుడు మాట్లాడుతూ, సంఘ భవనం, మార్కండేయ స్వామి ఆలయ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కులస్తులకు అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం అధ్యక్ష, ప్రచార కార్యదర్శులను పద్మశాలీ కులస్తులు, మహిళలు శాలువాలతో సన్మానించారు. వీరి వెంట గ్రామ పద్మశాలీ కులస్తులు ఉన్నారు.

# క్యాంపు ఆఫీస్ వద్ద అలజడి


కాంగ్రెస్ నాయకులను పంపిస్తున్న పోలీసులు

తిమ్మాపూర్, డిసెంబర్ 3: మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ నాయకులు అలజడి సృష్టించారు. ఆ పార్టీ అభ్యర్థి డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గెలుపొందడంతో ముగ్గురు నాయకులు క్యాంపు కార్యాలయం వద్దకు వెళ్లి కాంగ్రెస్ జెండాలతో వీడియోలు తీశారు. దీంతో అక్కడే ఉన్న బీఆర్ఎస్ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న పోలీసులు కాంగ్రెస్ నాయకులను అక్కడి నుంచి పంపించేశారు.


శంకరపట్నం: కేశవపట్నంలో సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు

# కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

తిమ్మాపూర్, డిసెంబర్ 3: మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గెలుపొందడంతో మండల వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సంబురాల జరుపుకొన్నాయి. పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. పలువురు నాయకులు కవ్వంపల్లిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

శంకరపట్నం, డిసెంబర్ 3: డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో కాంగ్రెస్ శంకరపట్నం మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో స్వీట్లు పంచుకుని, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద కేశవపట్నం గ్రామాధ్యక్షుడు మొలుగూరి సదానందం ఆధ్వర్యంలో పటాకులు కాల్చి నృత్యాలు చేశారు. డప్పుల వాయిద్యాల నడుమ కేశవపట్నం, తదితర గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


తిమ్మాపూర్: అల్లునూర్‌లో సంబురాలు జరుపుకొంటున్న నాయకులు